ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY 5

జయశంకర్ భూపాలపల్లి ములుగు

శుక్రవారం 9 ఆగస్టు 2024



■ నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

అడవిబిడ్డల అరిగోస



రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాక రోగిని ఆస్పత్రికి మోసుకెళ్తున్న గ్రామస్థులు (ఫైల్)

బురదమయంగా ఏటూరునాగారం మండలంలోని కొండాయి- ఊరట్టం రోడ్డు

ప్రభుత్వాలు మారుతున్నా మారని తలరాత

- అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గ్రామాలు
- పూర్తిస్థాయిలో దరిచేరని సర్కారు పథకాలు
- ఐటీడీఏ చేయూతనిస్తున్నా నెరవేరని లక్ష్యం
- విభిన్న జీవనం, పండుగలు వారి సొంతం

వివరాలు : 7 లో..



పాశ్చాత్య పోకడలకు దాసోహం కాని జీవన విధానాలు వారివి.. చెట్టు, పుట్టలే దేవతలు.. పుడమిని, ప్రకృతిని దైవంగా కొలిచే అమాయక మనసులు వారివి. అడవుల్లో ఉంటూ శ్రమైక జీవనాన్ని నమ్ముకుని ఆడంబరాలకు దూరంగా జీవిస్తున్నారు ఆదివాసీలు. ప్రభుత్వాలు తమ వైపు చూడకపోయినా.. పథకాలు ఇవ్వకపోయినా.. అభివృద్ధికి 'బాటలు' వేయక పోయినా.. రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులు పటిష్ఠ అమలుకు నోచుకోకపోయినా మానవుడి పోకడల్లో ఎన్ని మార్పులు వచ్చినా తమ సంస్కృతీ, సంప్రదాయాలను మాత్రం చెక్కు చెదరనివ్వకుండా కాపాడుకుంటున్నారు. ప్రపంచం మారుతున్నా.. అభివృద్ధిలో దూసుకుపోతున్నా వారు మాత్రం అట్టడుగునే ఉంటున్నారు. వారి అభివృద్ధి కోసం ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కేవలం కాగితాలకే పరిమితమవుతుండటంతో ఆ గిరిపుత్రులు ఆవేదన చెందుతున్నారు.

- ఏటూరునాగారం రూరల్

మహిళ అనుమానాస్పద మృతి



కోరం మంగమ్మ (ఫైల్)

మేడారం, ఆగస్టు 8 : అనుమానాస్పదంగా గొత్తికోయ మహిళ మృతి చెందిన సంఘటన తాడ్వాయి మండలంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్లాపూర్ పంచాయతీ పరిధి తక్కెళ్లగూడెం గొత్తికోయగుంపునకు చెందిన కోరం మంగమ్మ (40) తన భర్త మంగయ్య వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో బుధవారం ఉదయం మద్యం సేవించి పక్కనే ఉన్న ఆమె ఇంటికి వెళ్లి గొడవకు దిగింది. రోజంతా వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో మంగమ్మను ఆ మహిళ కర్రతో దాడి చేసింది. దీంతో అక్కడికి చేరుకున్న మంగమ్మ కుమారుడు మహేష్ గొడవను సద్దుమణిగించి ఆమెను ఇంటికి తీసుకొచ్చాడు. గురువారం ఉదయం నిద్రలేచిన మంగమ్మ ఎప్పటిలాగే దైనందిన పనుల్లో నిమగ్నమైంది. గంట వ్యవధిలోనే ఒక్కసారిగా అస్వస్థతకు గురై మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ జి.రవీందర్ విచారణ చేపట్టారు. ఆ మహిళ కర్రతో కొట్టడం వల్లే తన తల్లి మృతి చెందిందని మంగమ్మ కుమారుడు మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి, ఆమెను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎవరిని అడగాలే..



భూపాలపల్లిలోని కేడీసీసీబీలో వివరాలు తెలుసుకుంటున్న రుణమాఫీ కాని రైతులు

- రుణమాఫీ కాని రైతుల్లో అయోమయం
- భూపాలపల్లి జిల్లాలో తప్పని తిప్పలు
- బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- సందేహాలను నివృత్తి చేయని అధికారులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణమాఫీ రైతన్నలను ఎంతో ఊరటనిస్తోంది. క్రాఫ్ లోన్లు తీరి తమ కష్టాలు కడతేరాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ సౌలభ్యానికి నోచుకోని రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. కొంతమందికి రుణమాఫీ అయినా మరికొంత మందికి నిరాశే ఎదురైంది. తమకు రుణమాఫీ ఎందుకు కాలేదనే విషయం తెలియక సతమతమవుతున్నారు. ఎవరిని అడగాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. బ్యాంకులకు వెళ్తే.. తమకేం తెలియదని, వ్యవసాయ శాఖ అధికారులనే అడగమని అంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులను అడిగితే బ్యాంకు అధికారులను అడగమని అంటున్నారని మదనపడుతున్నారు. అటు బ్యాంకులు, ఇటు వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగినా రుణమాఫ కాకపోవడంపై స్పష్టత రావడం లేదని అంటున్నారు.

రెండు విడతల్లో 25,256 మందికి..


ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు విడతల్లో రుణమాఫీ ప్రక్రియ చేపట్టగా భూపాలపల్లి జిల్లాల్లోనూ అధికారులు దీనికి శ్రీకారం చుట్టారు. మొదటి విడతలో లక్ష రూపాయలలోపు రుణం ఉన్న 16,502 మంది రైతులకు మొత్తం రూ.85,00,12,230 కోట్లు మాఫీ అయినట్లు వెల్లడించారు. అలాగే, రెండో విడతలో లక్షన్నరలోపు రుణానికి 8754 మంది రైతులకు రూ.95,95,47,866 కోట్లు మాఫీ అవుతున్నట్టు వివరించారు. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 25,256 మంది రైతులకు రుణ మాఫీ జరిగింది. జిల్లా వ్యాప్తంగా 1,22,000 మంది రైతులు ఉండగా కొంత మంది మినహా మిగిలిన వా రంతా రుణమాఫీ తీసుకున్న రైతులే ఉంటారు. రుణమాఫీ కాని రైతులు మాత్రం నానా ఇబ్బందులు పడుతున్నారు.

ఒకరిని కలవాలంటూ ఒకరు

రుణమాఫీపై స్పష్టత ఇవ్వాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పే విషయంలో బ్యాంకు అధికారులు చేతులేత్తేస్తున్నారు. తమ వద్ద ఎలాంటి సమాచారం ఉండదని, వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని చెబుతున్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి వారికి మాఫీ ఎందుకు కాలేదో చెప్పాల్సిన వ్యవసాయశాఖ అధికారులు కేవలం మండల కేంద్రాల్లోని రైతు వేదికలకే పరిమితం అవుతున్నట్లు తెలుస్తోంది. రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్తే కలవడం లేదని, కనీసం ఏవోలు, ఏఈవోలకు ఫోన్ చేసినా ఎత్తడం లేదని రైతులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అధికారులు కలిసినా మళ్లీ బ్యాంకర్ల వద్దకే వెళ్లి అడగాలనే ఉచిత సలహా ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎవరిని అడగాలో తెలియక రైతులంతా సతమతమవుతున్నారు.

ఫిర్యాదుల స్వీకరణకే హెల్ప్‌డెస్క్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు తాత్కాలికంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ రైతుల నుంచి ఫిర్యాదుల ను స్వీకరించి వ్యవసాయశాఖ అధికారులకు నివేదిస్తున్నారు. అయితే, తమకు రుణమాఫీ ఎందుకు కాలేదనే విషయాన్ని మాత్రం అధికారులు చెప్పడం లేదు. రుణమాఫీ కాలేదని, సమాచారం తెలుసుకుందామని కార్యాలయానికి వచ్చిన రైతుల నుంచి దరఖాస్తు రూపేణా వారి పేరు, ఆధార్‌కార్డు, సెల్‌నంబర్‌తో పాటు ఎంత రుణం ఉందో వివరాలను మాత్రం తీసుకుంటున్నారు. రైతులు అడిగే సందేహాల పట్ల ఆ దరఖాస్తును కమిషనరేట్‌కు పంపిస్తామని, ఆ తదుపరి అక్కడి నుంచి వచ్చే వివరాలను తెలియజేస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

- కేయూ పాలక మండలి కీలక నిర్ణయం
- హైదరాబాద్‌లో ఇన్‌చార్జ్ వీసీ కరుణ ఆధ్వర్యంలో సమావేశం
- తప్పుడు సమాచారమిచ్చిన డీన్లు, హెచ్‌వోడీలపై మండిపాటు
- పకడ్బందీగా వర్సిటీ ప్రహరీ నిర్మాణం
- వీసీ సెర్చ్ కమిటీ మెంబర్‌కు ఈసీ సిఫార్సు

7లో



కేయూ పాలకమండలి సమావేశంలో పాల్గొన్న వీసీ వాకాటి కరుణ

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 8: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కిరణ్‌ఖరే ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనే తేడా లేకుండా స్నేహపూర్వకంగా కలిసి మెలిసి విద్యనభ్యసించాలని సూచించారు. ర్యాగింగ్ లాంటి కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్తు కోల్పోతారని పేర్కొన్నారు. కళాశాలలపై పోలీసుల నిఘా నిరంతరం ఉందని, ఎలాంటి దుశ్చర్లకు పాల్పడినా చర్యలు తీసుకుంటా మని ఎస్పీ హెచ్చరించారు.

గంజాయి ముఠాల గుట్టురట్టు

- రెండు చోట్ల 13 మంది అరెస్టు
- గణపురంలో ఆరుగురు, కాటారంలో ఏడుగురు
- భూపాలపల్లి జిల్లాలో వేర్వేరు ఘటనలు



భూపాలపల్లిలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి)/కాటారం, ఆగస్టు 8: గంజాయి రవాణా చేస్తున్న రెండు ముఠాల గుట్టును గణపురం, కాటారం పోలీసులు రట్టు చేశారు. మొత్తం 13 మందిని వేర్వేరుగా అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు తన చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గణపురం ఎస్సై అశోక్ నేతృత్వంలో సిబ్బంది గణపురం మండలం గొల్లపల్లి క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓ వ్యక్తి బైక్‌పై, మరో ఐదుగురు ఆటోలో అనుమానాస్పదంగా తారసపడ్డారు. వారిని తనిఖీలు చేయగా ప్లాస్టిక్ కవర్‌లో కట్టి ఉన్న గంజాయి లభ్యమైంది. చిట్యాల మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన జనగం ప్రేమ్‌తేజ్, భూపాలపల్లి మండలం వేశాలపల్లికి చెందిన లావుడ్య సిద్ధు, గణపురం మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కీసర సంతోష్, అడవిముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన కొండగొర్ల రంజిత్, భూపాలపల్లి పట్టణానికి చెందిన మేకల అరుణ్, కడారి సాయికుమార్ కొంతకాలంగా భద్రాచలం ప్రాంతం నుంచి గంజాయిని తక్కువ ధరకు తీసుకొచ్చి గణపురం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు సరఫరా చేస్తున్నట్టు తేలింది. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయితోపాటు ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెపారరు. విలేకరుల సమావేశంలో చిట్యాల సీఐ మల్లేష్, గణపురం ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.



కాటారంలో నిందితులను అరెస్టు చూపుతున్న పోలీస్ అధికారులు

కాటారంలో తనిఖీలు చేస్తుండగా...

మరో ఘటనలో గంజాయిని విక్రయించడానికి తెచ్చిన ఏడుగురు యువకులను కాటారం పోలీసులు పట్టుకున్నారు. మహదేవపూర్ సీఐ రాంచందర్‌రావు, కాటారం ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం శివారులో యువకులు గంజాయితో సంచరిస్తున్నారనే సమాచారం పోలీసులకు వచ్చింది. దీంతో ఎస్సై అభినవ్ తన సిబ్బందితో గురువారం

మిగతా 8వ పేజీలో...

పకడ్బందీగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 8: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మునిసిపల్ అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. భూపాలపల్లి పట్టణంలోని సీఆర్‌నగర్ కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన గురువారం పరిశీలించారు. అదే కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో సరదాగా ముచ్చటించారు. పౌష్టికాహారం సరిగా అందుతుందా.. లేదా? అనే విషయాన్ని టీచర్ శోభారాణిని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ రాజేశ్వర్‌ను వివరాలు అడిగారు. స్వచ్ఛ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటులో అలసత్వం వహిస్తున్న విషయమై కమిషనర్ రాజేశ్వర్‌పై, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వీపింగ్ యంత్రం ఎందుకు వినియోగించడం లేదని అడిగారు. ప్రతిరోజూ ఉదయాన్నే పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బందిని వార్డుల వారీగా విభజించి పంచాలని చెప్పారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే వాహనాలకు వెంటనే జీపీఎస్ ఏర్పాటు చేయాలని అన్నారు. హరితహారం నిధులతో ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని, స్వచ్ఛ భారత్ నిధులతో పారిశుధ్య పనులు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. పట్టణంలో ఎక్కడా వ్యర్థాలు కనబడకుండా తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

కుక్కల నియంత్రణకు శస్త్ర చికిత్సలు

కుక్కల నియంత్రణకు శస్త్ర చికిత్సలు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ మునిసిపల్ అధికారులు, వెటర్నరీ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ రూంను ఆయన పరిశీలించారు. ఆపరేషన్ తర్వాత కుక్కలను కొన్ని రోజులు సంరక్షించాలని అన్నారు. ఈ క్రమంలో వాటిని బోన్లలో విడివిడిగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఈ మానస, ఆర్ఐ భాస్కర్ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- కొలువుదీరిన చిట్యాల ఏఎంసీ పాలకవర్గం

చిట్యాల, ఆగస్టు 8: రైతు సంక్షేమమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా జీఎస్సార్ మాట్లాడుతూ రూ. 1.50 లక్ష లోపు రైతులకు వ్యవసాయ రణాలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. రైతులు ఆనందంతో డబ్బులను బ్యాంకుల నుంచి ఇళ్లకు తీసుకుపోతున్నార న్నారు. ఏదైనా సమస్యలతో రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణ మాఫీ జరుగుతుందన్నారు. త్వరలోనే అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మార్కెట్ పరిధిలోని చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల ప్రజలు పంట సరుకులు విక్రయించేందుకు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఇక్కడే పంట సరుకుల కొనుగోళ్లు ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంపిణీ చేశారు. చిట్యాల, ఒడితల గ్రామాల్లో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్లను ప్రారంభించారు.

ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గం

చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. చైర్‌పర్సన్, డైరెక్టర్లతో మార్కెట్ కార్యదర్శి కనకశేఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, డైరెక్టర్లు ఎం.సమ్మయ్య, కె.సంపత్, నల్లబెల్లి విజేందర్, మటిక రవీందర్, భూక్య రాజు, మేర్గు లక్ష్మి, చెన్న చందర్, లింగంపల్లి కిరణ్, కె.సతీష్‌రెడ్డి, ఓనపాకల లింగయ్య, వెంగల వినయ్‌కుమార్, ఆకుల బాలచంద్ర ప్రమాణం చేశారు. నూతన పాలకవర్గాన్ని అధికారులు, ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, సీనియర్ నేతలు మధు, రాంనర్సింహారెడ్డి, పులి తిరుపతిరెడ్డి, మధువంశీకృష్ణ, అప్పం కిషన్, దొడ్డి కిష్ట య్య, ఓరం సమ్మయ్య, బుర్ర లక్ష్మణ్, శ్రీనివాస్, మూడు మండలాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో ఏఎంసీ నూతన పాలకవర్గం

వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం

- ఏ జిల్లాకు ఎవరు డీఎంహెచ్‌వోనో తెలియని వైనం
- వరంగల్ జిల్లాలో ఒకే పోస్టులో ఇద్దరు ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జూలై 8: ఉమ్మడి వరంగల్ వైద్య, ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన బదిలీలు గందరగోళానికి దారితీస్తున్నాయి. వైద్యాధికారులు బదిలీ అయిన స్థానాలకు వెళ్లకుండా పాత స్థానంలోనే ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. రాష్ట్ర వైద్య సంచాలకుల కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన బదిలీలు, పోస్టింగులపై పలువురు వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బదిలీలపై నిషేధం విధించినప్పటికీ పాత తేదీలపై ఉత్తర్వులు వెలువడుతూనే ఉన్నాయి.

డీఎంహెచ్‌వో ఎవరు?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు జిల్లాల్లో అసలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎవరనేది అయోమయంగా ఉంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా పని చేసిన డాక్టర్ బి.సాంబశివరావు వరంగల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇంతవరకు మూమెంట్ అర్డర్ రాకపోవడంతో ఆయన హనుమకొండలోనే పనిచేస్తున్నారు. ఇక హనుమకొండకు రావాల్సిన ములుగు డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య మూమెంట్ ఆర్డర్ రావడం లేదని ఇంకా ములుగులోనే కొనసాగుతున్నారు. ఇక కరీంనగర్‌కు వెళ్లాల్సి ఉన్న డాక్టర్ వెంకటరమణ ఇదే సాకుతో వరంగల్‌లోనే కొనసాగుతున్నారు.

ఒకే పోస్టులో ఇద్దరు

గత నెల 27న సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సదానందంను బదిలీ చేసి ఆయనస్థానంలో హనుమకొండ జిల్లాకు చెందిన ఎం.హనుమానాయక్‌కు పోస్టింగ్ ఇచ్చారు. బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు విడుదల చేశారు. ఈ మేరకు హనుమనాయక్‌ను సంగెం పీహెచ్‌సీ వైద్యాధికారి విధుల్లో చేర్చుకున్నారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ.. ఈ నెల 8న మరో లేఖ విడుదలైంది. బదిలీ అయిన సదానందంను మళ్లీ అదేస్థానానికి పోస్టింగ్ ఇస్తూ గత నెల 31వ తేదీన ఉత్తర్వులు విడుదల చేసినట్లు అందులో ఉంది. కాగా, ఇంత హైటెక్ సమాజంలో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు లేఖ వచ్చేందుకు 8 రోజులు పడుతుందా..? అని ఉద్యోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒకే పోస్టులో ఇద్దరు ఉద్యోగులను నియమించడం వైద్య, ఆరోగ్యశాఖకే చెల్లుతుందని విమర్శిస్తున్నారు. కాగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం అధికారుల తీరు వల్లనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖలో జరిగిన బదిలీలపై జ్యుడీషియల్ విచారణ కొనసాగిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని ఉద్యోగులు అంటున్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న లయన్ క్లబ్ ప్రతినిధులు

వ్యక్తిత్వ నిర్మాణానికి 'లయన్ క్వెస్ట్' దోహదం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: విద్యార్థుల్లో వ్యక్తిత్వ నిర్మాణానికి లయన్‌క్వెస్ట్ శిక్షణ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి అన్నారు. గురువారం ఉర్సుగుట్ట వద్ద ఉన్న ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ సారథ్యంలో ఉపాధ్యాయులకు లయన్ క్వెస్ట్ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సక్రమ మార్గంలో నడిచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనేక జనాభా ఉన్న మన దేశంలో లయన్స్ క్వెస్ట్ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. గౌరవ అతిథి, క్వెస్ట్ ప్రోగ్రామ్ ప్రాజెక్టు మేనేజర్ లయన్ శివప్రసాద్ మాట్లాడుతూ... శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంజేపీ ఉపాధ్యాయులు ఇక్కడ నేర్చుకున్న ప్రతీ విషయాన్ని విద్యార్థుల్లో మానవతా విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడేలా వారికి నేర్పించాలన్నారు. ఎంజేపీ ఆర్‌సీవో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుతున్న ఈపాఠశాలల్లో వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఇలాంటి క్వెస్ట్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం గత ఏడాది ఎంజేపీ కళాశాలల్లో ర్యాంకులు సాధించిన 14 మంది విద్యార్థులను అతిథుల చేతుల మీదుగా సన్మానం చేశారు. శిక్షణ కార్యక్రమానికి శిక్షకురాలుగా కొండపల్లి రేణుక వ్యవహరించగా కార్యక్రమంలో జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ కందుకూరు వెంకట్‌రెడ్డి, ఫస్ట్ డిప్యూటీ గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, ప్రోగ్రాం అసిస్టెంట్ కోఆర్డినేటర్ లయన్ పరికిపండ్ల వేణు, లయన్ డాక్టర్ రాజలక్ష్మి, లయన్ మార్గం ప్రభాకర్, లయన్ రవీందర్‌రెడ్డితో పాటు 37 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిస్టరీలో వసంతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ విశ్వవిద్యాలయం హిస్టరీ విభాగం పరిశోధకురాలు ఇటికాల వసంత డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు గురువారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి వసంతకు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'తెలుగు ప్రాంతంలో మాతంగి సంస్కృతి- ఒక పరిశీలన' అనే అంశంపై కేయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ పర్యవేక్షణలో వసంత పరిశోధన పూర్తి చేశారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామానికి చెందిన వసంత అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వసంతను పలువురు అభినందించారు.







అడవిబిడ్డల అరిగోస

● అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గ్రామాలు ● నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 8: అడవులే ఆదెరువుగా.. పాశ్చాత్య సంస్కృతి, జీవన విధానానికి దాసోహం కాని కట్టుబాట్లతో.. ప్రకృతినే దేవతలుగా కొలుస్తూ.. శ్రమైక జీవనమే తమ తరగని సౌందర్యమని నిరూపిస్తూ.. ఆత్మగౌరవమే తరగని ఆస్తిగా జీవిస్తున్నారు అడవిబిడ్డలు. ప్రపంచ పోకడల్లో ఎన్ని పెనుమార్పులు వచ్చినా తమ సంస్కృతీ, సంప్రదాయాలు చెక్కు చెదరవని, వనదేవతలు సమ్మక్క-సారలమ్మ పోరాట స్ఫూర్తి, యోధుడు కొమురంభీం తెగువను చాటుతూ తమ అస్థిత్వాన్ని, మనుగడను చెక్కు చెదరనివ్వడం లేదు ఆదివాసీలు. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేకమైన చట్టాలు, హక్కుల సాధనకు ప్రభుత్వాలు, పాలకులతో అలుపెరగని పోరును నేటికీ కొనసాగిస్తూనే.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్నా.. తమ తలరాతలు మారడం లేదంటూ జల్.. జంగల్.. జమీన్ నినాదాన్ని ముందుకు తీసుకుపోతూ న్యాయమైన డిమాండ్ల సాధనకు నడుం బిగిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమకు అందకపోతుండటంతో వారు నేటికీ అభివృద్ధిలో వెనుకబడే ఉన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీల బతుకుచిత్రంపై ప్రత్యేక కథనం.

హక్కులు, చట్టాల అమలుకు నిరంతరం పోరాటమే..

మన రాజ్యాంగం ఆదివాసులకు ప్రత్యేకమైన, పటిష్టమైన హక్కులు, చట్టాలను కల్పించినా అవి సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు 1/70 చట్టం రక్షణ కవచమే అయినా ఆ చట్టం అమలు ఆశాజనంగా లేదంటూ ఆదివాసులు ఆవేదన చెందుతున్నారు. 1959లో భారత ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనుల భూములు, ఆస్తులను గిరిజనేతరులు కొనకూడదని చట్టాన్ని తీసుకువచ్చి దీన్ని 1963నుంచి అమలు చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల భూములను గిరిజనేతరులు కొనడానికి, అమ్మడానికి వీలు లేదని స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో పెసా చట్టానికి పూర్తి అధికారులున్నాయి. 5, 6వ షెడ్యూల్‌లో పెసా గ్రామ సభ ద్వారానే ప్రభుత్వ పథకాల అమలు జరగాలి. గ్రామసభ తీర్మానం లేనిదే ఎలాంటి పనులు చేయడానికి వీలు లేదు. కానీ ఆ పెసా చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని, పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆదివాసీ సంఘాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ చట్టం సరిగా అమలు జరిగితే ఆదివాసీగూడేలు అభివృద్ధిపథంలోకి వెళ్లడమే కాకుండా ఆదివాసీ సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఆదివాసీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. 5వ, 6వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు భారత రాజ్యాంగం స్వేచ్ఛగా జీవించే అధికారాలు ఇచ్చినా ఆ పరిస్థితులు ఏజెన్సీలో లేకుండా పోయాయి.

గిరిపల్లెలకు ఐటీడీఏ అండ.. సత్ఫలితాలిస్తోందా?

ఆదివాసీ పల్లెలకు ఐటీడీఏ అండగా నిలుస్తోంది. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏల ఏర్పాటుతో ఆదివాసీల పల్లెలకు జీవం పోసినట్లయింది. కానీ అనుకున్నంతా లక్ష్యాలకు ఆమడదూరంలోనే ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న అనుకున్నంతా లక్ష్యాలను చేరుకోవడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 5.30లక్షల మంది ఆదివాసీలు ఉన్నారు. 1986లో ఏటూరునాగారంలో ఐటీడీఏను నెలకొల్పారు. ఐటీడీఏ పరిధిలో మొత్తం 13ఏజెన్సీ మండలాలకు విస్తరించి ఉంది. ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఐటీడీఏ పెద్ద దిక్కుగా ఉంటుంది. కానీ ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా అనుకున్న లక్ష్యాలను మాత్రం చేరువకాలేదు. గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సంక్షేమం తదితర శాఖలు మెరుగైన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. గిరిజనులకు ఇప్పటికీ రోడ్ల సౌకర్యం లేని గ్రామాల్లో ఎన్నో ఉన్నాయి.

జీవన విధానం, పండుగలు అంతా వైవిధ్యమే

ఆదివాసీల జీవనవిధానం, పండుగలు వైవిధ్యంగా ఉంటాయి. రాష్ట్రంలో మొత్తం తొమ్మిది ఆదివాసీ తెగలున్నాయి. ఆంధ్, భిల్, చెంచుతో చెంచువారు, గోండ్ (నాయక్‌పోడ్, రాజ్ గొండ్, కొండరెడ్లు, కొలామ్ (మన్నెవార్లు), కోయ (బినే కోయ, రాజ్ కోయ, పర్ధాన్, తోటి వంటి తెగలు కలవు. గొండ్ ఆదివాసీ తెగ నోగోబా జాతర, జంగుబాయి పండుగను ప్రధానంగా జరుపుకుంటారు. అంధ్ తెగ వారు పూలాజీ బాబా జయంతి, సిరాల్ పండుగను జరుపు కుంటారు. కొలామ్ తెగ వారు భీమా నాయక్ జాతర, నాయక్‌పోడ్ గాంధారి మైసమ్మ జాతర, లక్ష్మీ దేవర పండుగను జరుపుకొంటారు. చెంచులు భౌరాపూర్ జాతర, సలేశ్వరం జాతర, లొద్ది జాతర, కోయలు సమ్మక్క-సారలమ్మ జాతరలను జరుపుకొంటారు. దీంతో పాటు ఆదివాసీలు పెద్దల పండుగ, భూమి పండుగ, ఇప్పపూల పండుగ, చిక్కుడు కాయ, గోంగూర, మొక్కజొన్న పండుగలే కాక కోయ తెగలలో ఇంటి పేరుతో గల ఇలవేల్పుల పండుగలు జరుపుకుంటారు.

ఆదివాసీ దినోత్సవ నేపథ్యం

ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు రక్షణకు ప్రపంచ దేశాలు నడుం కట్టి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1982 ఆగస్టు 9వ తేదీన 26మందితో స్వతంత్ర మానవ హక్కుల నిపుణులతో వర్కింగ్ గ్రూప్ సమావేశం జరిగింది. తదనంతరం 1994లో యూఎన్‌వో జనరల్ అసెంబ్లీ కమిటీ సమావేశమైన రోజునే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని జరపాలని తీర్మానించింది. అప్పటి నుంచి ప్రతీ యేటా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతోంది.

ఐటీడీఏలను బలోపేతం చేయాలి

కబ్బాక శ్రావణ్‌కుమార్, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏలను ప్రభుత్వం బలోపేతం చేయాలి. గిరిజన గ్రామాలు నేటికీ నిరాధరణకు గురవుతున్నాయి. గిరిజన అభివృద్ధికి బడ్జెట్‌లో లెక్కలు చూపుతున్నా అవి కాగితాలకే పరిమితమవతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీల బతుకులు మారడం లేదు. ఐటీడీఏలను ప్రభుత్వాలు గాలికొదిశాయి. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు పటిష్ఠంగా అమలు చేయాలి.

నేడు కేయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ఆగస్టు 9న శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు నిర్వహిస్తామని ఆదివాసీ విద్యార్థి సంఘం కేయూ నేతలు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు కేయూ మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటీవ్ బిల్డింగ్ వరకు ఆదివాసీ కల్చరర్ ర్యాలీ, పతాకావిష్కరణ, జ్యోతి ప్రజ్వలన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, విశిష్ట అతిథులుగా ములుగు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.భిక్షపతిరావు, వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు, హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, రిటైర్డు అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సారయ్య దొరలు పాల్గొని మాట్లాడుతారని వెల్లడించారు.

హైకోర్టు ఏజీపీగా రూహీ నబీల నియామకం



వరంగల్ లీగల్, ఆగస్టు 8: రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా (ఏజీపీ)న్యాయవాది రూహీ నబీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ప్రకటన వెలువరించింది. హనుమకొండ అడ్వకేట్స్‌కాలనీ ప్రాంతానికి చెందిన రూహీ నబీల 2016లో న్యాయవాదిగా నమోదు చేసుకొని కొంతకాలం వరంగల్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం హైకోర్టులో తన ప్రాక్టీస్ ప్రారంభించారు. ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. తన తండ్రి సీనియర్ న్యాయవాది మహ్మద్ మైమూద్ వద్ద న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. చిన్న వయసులోనే ఏజీపీగా నియామకం కావడం పట్ల హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, న్యాయవాదులు ఆనంద్‌మోహన్, జంగా స్వప్న, రమాదేవి, నరేందర్, రహెమాన్, అండాళ్ తదితరులు అభి నందనలు తెలిపారు.

మహిళా పాలిటెక్నిక్‌లో 12న స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 8: వరంగల్ నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ కమర్షియల్ ప్రాక్టీస్ (సీసీపీ) మూడు సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.రామప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 12వ తేదీన స్పాట్ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

కేయూ పాలక మండలి కీలక నిర్ణయం ● వీసీ సర్చ్ కమిటీ మెంబర్‌కు ఈసీ సిఫార్సు



హైదరాబాద్ సచివాలయంలో సమావేశమైన కేయూ పాలక మండలి సభ్యులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 8: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు కొత్తగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించేందుకు కేయూ అత్యున్నత పాలక మండలి పచ్చజెండా ఊపి ఆమోదముద్ర వేసింది. వర్సిటీ పీహెచ్‌డీ బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని నిర్ణయించారు. దీంతో వర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులకు న్యాయం జరగనుంది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ నేతృత్వంలో కేయూ కొత్త పాలకమండలి తొలి సమావేశం జరిగింది. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ నవీన్, సామాజిక వేత్త పుల్లూరి సుధాకర్, డాక్టర్ చిర్ర రాజు, ఏఎస్‌ఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకుమారి, సామాజిక వేత్త చౌహన్, వర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్యలు పాల్గొన్నారు.

తొలి పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు క్యాంపస్‌లోని వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంపై దాడి చేయడం, తదనంతరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విద్యార్థులను కొట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా కేయూ పీహెచ్‌డీల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో వర్సిటీలోని అన్ని విభాగాల్లో నూతనంగా విద్యార్థులకు యూజీసీ నిబంధనలు, విద్యార్థుల మెరిట్ మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే వర్సిటీ అధికారులతో అంతర్గతంగా పీహెచ్‌డీ అడ్మిషన్లపై సమగ్రంగా చర్చించి విధి విధానాలు రూపొందించి విద్యార్థులకు కొత్తగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే విద్యార్థులు నష్టపోయారని, తొందరగా ఒకటి, రెండు రోజుల్లోనే పీహెచ్‌డీ అడ్మిషన్లపై తుది నిర్ణయం తీసుకుని అడ్మిషన్లు చేపట్టాలని పాలక మండలి సభ్యులు నిర్ణయించారు. వర్సిటీలో వివిధ విభాగాల డీన్లు, హెచ్‌వోడీలపై పీహెచ్‌డీ అడ్మిషన్ల ఖాళీలపై తప్పుడు సమాచారం ఇచ్చారని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ మండిపడినట్లు తెలిసింది. వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల ఖాళీలపై తప్పుడు సమాచారం ఇచ్చిన డీన్లు, హెచ్‌ఓడీలపై ఎందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయకూడదని కరుణ అన్నట్లు సమాచారం. అలాగే వర్సిటీ క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం పాలక మండలి సభ్యులు తీవ్రంగా చర్చించారు. ప్రహరీ నిర్మాణంలో క్షేత్రస్థాయిలో ఏర్పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. వర్సిటీ భూమి ఇంచు కూడా కబ్జాకు గురికాకుండా సర్వే ప్రకారం 100శాతం రక్షించాలని నిర్ణయించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురి కాకుండా చిత్తశుద్ధితో భూములను రక్షించాలని సమావేశంలో నిర్ణయించారు.

కాగా, వర్సిటీ క్యాంపస్ మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బ్లాక్ ఆఫ్ లేని సీసీ కెమెరాలను ఆధునీకరించాలని, డేటా బ్యాకప్ ఎక్కువగా ఉండేలా చూడాలని నిర్ణయించారు. అలాగే నూతనంగా వర్సిటీలో మూడు హాస్టళ్లలో డైనింగ్ హాళ్లు నిర్మించాలని, హాస్టళ్లకు అవసరమైన ఫర్నిచర్ కొనుగోలుకు అనుమతి ఇచ్చారు. అలాగే పార్టుటైమ్, అకడమిక్ కన్సల్టెన్స్‌గా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులకు పాలక మండలి సమావేశం తీపి కబురును నింపింది. వర్సిటీలో మొత్తంగా పార్టుటైమ్, కన్సల్టెన్స్ అధ్యాపకుల్లో వర్సిటీ శాంక్షన్ పోస్టుల్లో పనిచేస్తున్న అధ్యాపకులను అప్‌గ్రేడ్ చేసి కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించాలని నిర్ణయించారు. అయితే శాంక్షన్ బడ్జెట్ పోస్టులు, ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఎంత మేర బడ్జెట్ అవసరమవుతుందో చూడాలని, వారి వివరాలను తీసుకుని దాదాపుగా 40 మందిని కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి పాలక మండలి సిఫార్సు చేసింది. కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ అయితే నెల నెలా జీతం వచ్చి అధ్యాపకుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటారని పాలకమండలి సభ్యులు సిఫార్సు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తుది నిర్ణయం వెలువరించనుంది. నాన్ బడ్జెట్ పోస్టులు, ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల్లో పూర్తి వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకుల విషయంలో తుది నిర్ణయం తీసుకోలేదు.

వీసీ కోసం..

రాష్ట్రప్రభుత్వం అన్ని వర్సిటీలకు కొత్త వైస్‌చాన్స్‌లర్లను నియమించనున్న నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీకి ఈసీ నామినీగా ఒక్కరిని ఎంపిక చేయాల్సి ఉంది. దీని కోసం ముగ్గురు అనుభవజ్ఞులైన మాజీ వైస్ చాన్స్‌లర్లను పేర్లను ఈసీ సిఫార్సు చేయాల్సి ఉంది. దీనిలో భాగంగా గురువారం పాలక మండలి ముగ్గురిని ఎంపిక చేశారు. అయితే వీరిలో ఒక్కరిని ఖరారు చేయాల్సి ఉంది. సోమవారం మరోదఫా పాలక మండలి సభ్యులు వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో సమావేశమై ఈసీ నామినీగా ముగ్గురిలో ఒక్కరిని సిఫార్సు చేయనున్నారు.

రిజిస్ట్రేషన్లపై కొత్త అధికారుల కొర్రీలు

● నిబంధనల పేరిట ఇబ్బందులు ● 2,500కు పైగా పెండింగ్‌లో మ్యుటేషన్ సర్టిఫికెట్లు

రాంనగర్, ఆగష్టు 8: నూతన సబ్ రిజిస్ట్రార్లు ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో కొర్రీలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు చేసిన ఆస్తుల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని సమాచారం. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 కార్యాలయాల్లోని అటెండర్ నుంచి జిల్లా రిజిస్ట్రార్ వరకు బదిలీ అయిన విషయం తెలిసిందే. వీరి స్థానంలో నూతన సిబ్బంది బాధ్యతలు చేపట్టారు.



హనుమకొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

మ్యుటేషన్ సర్టిఫికెట్లలో..

రిజిస్ట్రేషన్ జరిగాక డాక్యుమెంట్ స్కాన్ చేశాక మ్యుటేషన్ సర్టిఫికెట్ సబ్ రిజిస్ట్రార్ సంతకంతో జారీ చేస్తారు. దీనికి రెండు రోజులు సమయం తీసుకుంటారు. కాగా, బదిలీ అయిన సబ్ రిజిస్ట్రార్లు రిలీవ్ అయ్యే రోజు వరకు రిజిస్ట్రేషన్‌లు చేశారు. దీంతో జారీకాని మ్యుటేషన్ సర్టిఫికెట్స్ 2500కు పైగానే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బదిలీ అయిన వారు చేసిన రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన మ్యుటేషన్ సర్టిఫికెట్స్‌పై తాము సంతకాలు పెట్టమని నూతన సబ్ రిజిస్ట్రార్లు మొండికేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఇక తల్లిదండ్రులు, వారి ఆస్తులను పిల్లలకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసే విషయంలో కొర్రీలు పెట్టి చేయడం లేదని సమాచారం. ఇళ్ల రిజిస్ట్రేషన్ విషయంలో లేనిపోని నిబంధనల పేరిట చేయడం లేదని తెలిసింది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

నూతన సబ్ రిజిస్ట్రార్ల వైఖరితో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు తగ్గినట్లు సమాచారం. హనుమకొండలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతీ రోజు 100కు పైగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరుగుతుండేవి. మూడు రోజులుగా 50లోపే జరుగుతున్నట్లు అధికారికంగా తెలిసింది. నూతన సబ్ రిజిస్ట్రార్ల వైఖరితో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసుకునే వారు సైతం ముందుకు రావడంలేదని సమాచారం. ప్రస్తుతం నెలకొన్న గందరగోళ వైఖరిపై ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సుభాషిణి సబ్ రిజిస్ట్రార్లతో భేటీ అయ్యి ఆస్తుల రిజిస్ట్రేషన్ విషయంలో స్పష్టత ఇవ్వకుంటే వరంగల్‌లో రియల్ దందా కుంటుపడే అవకాశాలున్నాయి. శాఖకు ఆదాయం తగ్గే అవకాశం ఉంది.

భార్యకు గుడికట్టి, విగ్రహం పెట్టిన భర్త



కొత్తగూడ, ఆగస్టు 8 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామంలో భార్యకు భర్త గుడికట్టి విగ్రహం పెట్టిన సంఘటన చోటు చేసుకుంది. కొత్తగూడ మండలంలోని ఓటాయికు చెందిన కుడికాల రమేష్ భార్య సరస్వతి సంవత్సరం క్రితం మృతి చెందింది. ఆమె జ్ఞాపకార్థం భర్త రమేష్ తన భార్య పోలికలతో విగ్రహం చేయించాడు. తన కుమారులు ప్రశాంత్, రోహిత్‌తో కలిసి రమేష్ తన భార్యకు కట్టిన గుడిని, విగ్రహన్ని గురువారం ఆవిష్కరించారు.

గుండెపోటుతో వృద్ధురాలి మృతి

ఆర్టీసీ బస్సులో వస్తుండగా ఘటన ● మృతురాలు వరంగల్ జిల్లా వాసి



మామిండ్ల గౌరమ్మ



తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 8 : గుండెపోటుతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన ప్రకారం. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికేడు గ్రామానికి చెందిన మామిండ్ల గౌరమ్మ (70) అనే వృద్ధురాలు తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఉదయం తొర్రూరు ఆస్పత్రికి చికిత్స కోసం కూతురు కొమురమ్మతో కలిసి రాయపర్తి వరకు ఆటోలో వచ్చింది. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో తొర్రూరుకు వస్తుండగా మార్గమధ్యలో ఛాతివద్ద నొప్పి రావడంతో ప్రయాణికులు కొం దరు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో బస్సు తొర్రూరు బస్టాండుకు చేరుకోగానే అంబులెన్స్‌లో గౌరమ్మను తొర్రూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని డాక్టర్లు నిర్ధారించారు. కాగా, మృతురాలి భర్త గతంలో మరణించగా, ఆమె ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. తన చేతులమీదే తల్లి మృతి చెందడంతో కుమార్తె విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

గురుకులాల్లో సౌకర్యాలకు ప్రతిపాదనలు పంపాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 8: గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం సీపీవో, సంక్షేమ, విద్య, పంచాయతీరాజ్, విద్యుత్, మిషన్ భగీరథ శాఖల అధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. అన్ని సంక్షమ శాఖల వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రిన్సిపాల్స్ ప్రతిపాదనలు అందజేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సంబంధిత శాఖ అధికారులు ఆశ్రమ పాఠశాలలను తనిఖీచేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఆశ్రమ పాఠశాలలకూ తాగునీరు అందించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సోలార్ వాటర్ హీటర్లు, సోలార్ సిస్టమ్, పాఠశాలల్లో ప్రహరీ, కిచెన్‌షెడ్స్, ఫెన్సింగ్, గేట్ల ఏర్పాటుకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు అందించాలన్నారు. సంక్షమ హాస్టల్స్‌లో మురుగునీరు నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కిటికీలు, తలుపులు, మరుగు దొడ్ల మరమ్మతులకు, నూతన నిర్మాణాలకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీపీవో శామ్యూల్, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి

మహదేవపూర్, ఆగస్టు 8: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఏకదాటిగా వాన పడటంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నుంచి వరద వచ్చి చెరుతోంది. కాళేశ్వరం వద్ద క్రమక్రమంగా పెరుగుతోంది.

నట్టేట ముంచిన కాంగ్రెస్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి

రేగొండ, ఆగస్టు 8 : మార్పు వస్తుందని నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి అధికారంలోకి తీసుకొస్తే ఆ పార్టీ నట్టేట ముంచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంక్ వద్ద కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కురుసాని తిరుపతి రావు ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిశీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుభరోసా, రుణమాఫీ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కి అన్నదాతను ఆగం చేసిందని విమర్శించారు. రేషన్‌కార్డు ప్రతిపాదికన రైతులకు రుణమాఫీ చేస్తామనడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాపన్న, ప్రసాద్‌రావు, తిరుపతిరెడ్డి, బుచ్చిరెడ్డి, రాజు, సయ్యద్ గాలిబ్, మోహన్, రాజేంద్ర నాయక్ పాల్గొన్నారు.

ఏపీజీవీ బ్యాంకు ఎదుట రైతుల నిరసన

మంగపేట: మండల పరిధి మల్లూరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఎదుట పలుగ్రారమాల రైతులు నిరసనకు దిగారు. రుణమాఫీని బ్యాంకర్లు సకాలంలో ఇవ్వడం లేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ మండల అధికారి చేరాలు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సకాలంలో రుణాలు అందేలా కృషి చేస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.

రుణ మాఫీతో రైతుల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, ఆగస్టు 8: రుణమాఫీతో రైతుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలో రూ.30లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ కార్యాలయం, ఇస్సిపేటలో రూ.27లక్షలతో నిర్మించిన ఫర్టిలైజర్ గోదాం, ఆకినపల్లి, పెద్దకోమటిపల్లి గ్రామాల్లో రూ.20లక్షల చొప్పున నిర్మించిన రెండు పల్లె దవాఖానలను ఆయన గురువారం ప్రారంభించారు. ములుకలపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు టైలు, బెల్టులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రూ.500 గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలు అయ్యాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం, విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని, పేద, బడుగు, బలహీనవర్గాలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అప్పులకుప్పగా నిలిచిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందు తాయని అన్నారు. వర్షాకాలంలో వ్యాధుల పట్ల వైద్యులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యసేవలందించాలని, ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటించాలన్నారు. అనంతరం మండలకేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్, రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, డీసీసీబీ జిల్లా సహకార అధికారి శైలజ, ఉమ్మడి వరంగల్ డీసీసీడీ సీఈవో వజీద్‌అలీ, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కటంగూరి రాంనర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, తహసీల్దార్ సునీత తోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగస్వాములు కావాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలో గురువారం నిర్వ హించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆయన రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి పాల్గొని చెత్తా చెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛమైన పర్యా వరణాన్ని ముందు తరాలకు అందించాలని, పచ్చదనం, పరిశుభ్రతతో గ్రామాలు విరాజిల్లినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఆరోగ్య వంతమైన గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాన్ ప్రకారమే చైన్‌స్నాచింగ్!

-భూపాలపల్లి నుంచి స్కూటీపై వచ్చి అపహరణ

మట్టెవాడ, ఆగస్టు 8: వరంగల్ నగరంలోని కొత్తవాడలో జరిగిన చైన్ స్నాచింగ్ భూపాలపల్లి జిల్లాకు చెందిన గంజాయి గ్యాంగ్ పనేనని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. గంజాయి స్మగ్లింగ్, గంజాయి వ్యసనానికి బానిసైన ఇద్దరు యువకులు వరంగల్ కొత్తవాడలో వనజ అనే మహిళ మెడలోంచి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డరని పోలీసులు గుర్తించారు. స్నాచింగ్ అనంతరం సీసీ కెమెరాలకు చిక్కకుండా జిగ్‌జాగ్ రూట్‌లో ట్రావెలింగ్ చేసి భూపాలపల్లికి స్కూటీపై పరారైనట్లు గుర్తించారు.

స్కూటీపై వచ్చి ..

ఓ యువకుడు జూలై 30న భూపాలపల్లి నుంచి స్కూటీపై హనుమకొండకు చేరుకోగా, మరో యువకుడు ఆర్టీసీ బస్సులో వరంగల్‌కు చేరుకున్నట్టు పోలీసులు తేల్చారు. సాయంత్రం ఇద్దరూ కలిసి వరంగల్ నగరంలో స్కూటీపై తిరుగుతూ కొత్తవాడ ప్రాంతంలో మడెలయ్య గుడి వద్ద చీకటిగా ఉన్న ప్రాంతాన్ని ఎంచుకుని అటువైపు వెళ్తున్న వనజ మెడలోంచి చైన్ స్నాచింగ్‌కు చేశారు. అనంతరం స్కూటీపై స్పీడ్‌తో అదే రోజు రాత్రి ములుగు రోడ్డులోని ఒక హాస్టల్ వద్ద మరో మిత్రున్ని కలిసి స్కూటీపై భూపాలపల్లికి పరారయ్యారు. రెండు రోజుల తర్వాత స్నాచర్లిద్దరూ భూపాలపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లి బంగారు గొలుసును విక్రయించి డబ్బులను పంచుకుని భూపాలపల్లికి వెళ్లినట్టు భావిస్తున్నారు. ప్రధాన నిందితులు భూపాలపల్లికి వెళ్లగా మరో నిందితు జమ్మికుంటలోని తమ సమీప బంధువులు ఇంటికి వెళ్లినట్టు తెలిసింది.

పోలీసుల అదుపులో నిందితులు?

మంగళవారం రాత్రి ఒక పుటేజీ పోలీసులకు చిక్కడంతో నిందితులను పట్టుకునేందుకు భూపాలపల్లికి వెళ్లారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరో నిందితుడు జమ్మి కుంటలో ఉన్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక బృందం మరో నింది తుడి అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. నిందితులు గంజాయి స్మగ్లింగ్, గంజాయి వాడుతుంటారని సమాచారం. ప్రధాన నిందితుడు 20 రోజుల క్రితమే గంజాయి స్మగ్లింగ్ కేసులో రాజమండ్రి జైలు నుంచి విడుదలైనట్లు తెలిసింది.

రామప్పను సందర్శించిన ఢిల్లీ అధికారులు



రామప్ప దేవాలయం ఆవరణలో అధికారులు

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 8: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని గురువారం న్యూ ఢిల్లీలోని డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుంచి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు గురువారం శిక్షణలో భాగంగా సందర్శించారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా పూజారులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం దేవాలయ శిల్పకళా సంపదను వీక్షించి ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.వినోద్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరంలో భక్తుల సందడి



కాళేశ్వరాలంయలో లక్షపత్రి పూజలు చేస్తున్న అర్చకులు

మహదేవపూర్, ఆగస్టు 8 : శ్రావణమాసం సందర్భంగా కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో గురువారం సందడి నెలకొంది. త్రివేణి సంగమ తీరంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. సరస్వతి, శుభానందదేవికి కుంకుమార్చనలు చేశారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మంచిర్యాల, హైదరాబాద్, తెలంగాణలోని పలు ప్రాంతాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలాగే శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన లక్ష పత్రిపూజలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రావణమాసంలో లక్ష పత్రి పూజలు చేస్తే కోటి ఫలితాలు వస్తాయన్న ఉద్దేశంతో స్వామివారికి ప్రత్యేకంగా పత్రి పూజ చేస్తామన్నారు.

ఎస్సీకాలనీ వాసులకు న్యాయం చేస్తాం : కలెక్టర్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగ స్టు 8: భూపాలపల్లి మండలం గుర్రంపేట ఎస్సీ కాలనీవాసులకు న్యాయం జరిగేలా చూస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం ఆ కాలనీని అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఓపెన్‌కాస్ట్ వల్ల పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తక్కువ మోతాదులో బ్లాస్టింగ్‌లు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఐటీడీఏ పీవో

వాజేడు, ఆగస్టు 8: ఏజెన్సీలో జ్వరాలపై అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్ర అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యంపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. డెంగీ, మలేరియా కిట్స్ ఎన్ని అందెబాటులో ఉన్నాయని ఆరా తీశారు. ఈ కిట్స్ లేకపోతే ఐటీడీఏ ద్వారా సరఫరా చేస్తామని అన్నారు. అనంతరం ఘనపురంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. గ్రామంలో ఫీవర్ సర్వేను పరిశీలించారు. పాఠశాలలో పారి శుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యఆరోగ్యశాఖ సిబ్బందిపై ఉంద న్నారు. వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందించాలని, గ్రామాల్లో హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కోరం క్రాంతి కుమార్, వైద్యాధికారులు మహేందర్, యోషిత తదితరులు ఉన్నారు.

ఓపెన్ టెన్త్ ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 8: ఓపెన్‌స్కూల్ పదోతరగతిలో ప్రవేశం కోసం ఈనెల 8నుంచి 10 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం జీవీవీ.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం జిరాక్స్, టీసీతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

బస్టాండ్ షాపులకు టెండర్

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 8: వెంకటాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఎనిమిది షాపులకు ఈనెల 9లోగా టెండర్ వేసుకోవాలని భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన బస్టాండ్ ఆవరణలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బస్టాండ్‌లోని షాపుల టెండర్‌లో పాల్గొనేందుకు ఎస్టీ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉందని అన్నారు. ఈనెల 9న మధ్యాహ్నం 2గంటలలోపు టీజీ ఆర్టీసీ ఖమ్మం పేరున డీడీలు తీసి టెండర్ ఫారాలు భద్రాచలం డిపోలో అందజేయాలని, 9న సాయంత్రం 3నుంచి 5గంటలలోపు షాపులకు వేలం నిర్వహిస్తామని అన్నారు.

పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి పెండింగ్ వేతనాలను చెల్లించాలని, వేతనాలకు ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించాలని, పీఆర్సీ పరిధిలోకి పంచాయతీ సిబ్బందిని తీసుకోవాలని, జీవో 60ప్రకారం వేతనాలు చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని, జీవో 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రాజేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎమ్డీ.అమ్జద్‌పాషా, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రవిగౌడ్, గ్రామపంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిమె సదయ్య పాల్గొన్నారు.

కొండాయిలో ఫీవర్ సర్వే

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు8: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న కొండాయిలో వైద్యాధికారులు గురువారం ఇంటింటా ఫీవర్ సర్వేను చేపట్టారు. కొండాయి వైద్యాధికారి డాక్టర్ ప్రణీత్‌కుమార్ తన సిబ్బందితో కలిసి కొండాయి, దొడ్ల, మల్యాల తదితర గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వేను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రోగాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షితమైన నీటిని తాగాలని సూచించారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె

మహదేవపూర్, ఆగస్టు 8 : మండలం కుదురుపల్లి గ్రామ పంచాయతీలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మె నేపథ్యంలోని మహదేవపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేశారు. కుదురుపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ కార్మికులు ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. మహదేవపూర్ గ్రామ పంచాయతీలో కార్మికులు ర్యాలీ తీసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నేడు భూపాలపల్లి మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

గణపురం, ఆగస్టు 8: భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ ప్రమాణ స్వీకారం శుక్రవారం జరగనుంది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ స్థలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరెడ్డి, ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 8: మండలంలోని ప్రజలు తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కోరారు. గురువారం మండలంలోని పాలంపేటలో తపాలాశాఖ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అధిక వడ్డీ పొదుపు పథకాలు, సుకన్య, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇన్సూరెన్స్, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీలు టాటా, బజాజ్, నివభూపా, స్టార్, ఆదిత్యబిర్లా వంటి పథకాలు పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేవతి, మెయిల్ ఓవర్సీస్ సురేష్, గణపురం సబ్ పోస్టుమాస్టర్ సురేష్, పాలంపేట బ్రాంచ్ పోస్టుమాస్టర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 8 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రభావం కొనసాగుతోంది. గురువారం బ్యారేజీకి ఇన్‌ఫ్లో 3.30లక్షల క్యూసెక్కులుగా ఉండగా 85గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం గురువారం 4.60మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికా రులు పేర్కొన్నారు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో బ్యారేజీ ఇన్‌ఫ్లో పెరుగుతున్నట్లు తెలిపారు. అన్నారం బ్యారేజీకి 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66గేట్లను ఎత్తి, అంతే నీటని దిగువకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

ములుగులో ఇంటింటి ఫీవర్ సర్వే

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 8: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ములుగులోని వివిధ కాలనీల్లో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది గురువారం ఇంటింటి ఫీవర్‌సర్వే చేపట్టారు. అదేవిధంగా పలు కాలనీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో అప్పయ్య మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో 81 టీంలతో వ్యాధి ప్రభావిత గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టామని అన్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బాధితులను గుర్తించి మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి మూడురోజులకోసారి కుండలు, గోలాల్లో నీటినిల్వలను మారుస్తూ ఉండాలని, వాటిపై మూతలు పెట్టాలని, తప్పకుండా దోమతెరలు వాడాలన్నారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రసాద్, దీపిక, మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు,ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కౌన్సిలర్ల వినతి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 8: భాస్కర్‌గడ్డ సమీపంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు విషయంపై మునిసిపల్ కౌన్సిలర్లుకలెక్టర్ రాహుల్ శర్మకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. గతం లోనే 393 ఇళ్లను అర్హులకు కేటాయిం చారని తెలిపారు. మళ్లీ వీరికే వాటిని కేటాయించాలని కోరారు. ప్రస్తుత ఎమ్మెల్యే 416 ఇళ్లను కాంగ్రెస్ నాయకుల ద్వారా కేటాయింపులు జరిపారని కలెక్టర్‌కు తెలిపారు. వాటిపై విచారణ జరిపి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నూనె రాజు, ఎం.తిరుపతి, ఎం.మురళి, బీ.సమ్మ య్య, నాయకులు మల్లేష్, శ్రీనివాస్, రాయమలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆందోళన

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 8: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న అన్ని స్కూల్ అసిస్టెంట్ ఖాళీలకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలని కోరుతూ గిరిజన ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళనకు చేపట్టారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోడెం సమ్మయ్య మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో అన్ని ఖాళీలను చూపించకుండా ఐటీడీఏ విద్యావిభాగం అధికారులు కొన్నింటిని మాత్రమే బ్లాక్ చేశారని విమర్శించారు. దీంతో సీనియర్ ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం సిద్ధం చేస్తున్న సీనియారిటీ జాబితాను ఆర్డర్ ఆఫ్ సెలక్షన్ మెరిట్ తయారు చేయాల్సి ఉండగా దానికి విరుద్ధంగా పుట్టిన తేదీ, డేట్ ఆఫ్ జాయినింగ్ పరిగణనలోకి తీసుకుం టున్నారని అన్నారు. గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలల్లో మహిళ ఉపాధ్యాయులచే నియమించిన తర్వాతనే మిగిలిన ఖాళీలను ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం మిగిలిన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో యూటీ ఎఫ్ జిల్లా కార్యదర్శి చెంచయ్య, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్‌కుమార్, ఏటీఏ అధ్యక్షుడు ఈసం రమేష్, టీడబ్ల్యూటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెర రమేష్, ఉపాధ్యాయులు గడ్డం లక్ష్మీనారాయణ, కవిత, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

చిట్యాల, ఆగస్టు 8: మండలంలోని జూకల్లు, చల్లగరిగ, చిట్యాల గ్రామాల్లో ఉపాధి హామీ పనులను డీఆర్డీవో నరేష్, అడిషనల్ డీఆర్డీవో వసుమతి గురువారం పరిశీలించారు. పళ్ల తోటలు, అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించి రైతులు, కూలీలకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో జయశ్రీ, ఎస్‌బీఎం వెంకటేశ్, ఏపీవో అబ్దుల్ అలీం, పంచా యతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠాల గుట్టురట్టు

(5వ పేజీ తరువాయి)

తెల్లవారుజామున కాటారం-మంథని రహదారిపై పెట్రోల్ పంప్ వద్ద ఉన్న ఆదివారంపేట మలుపు వైపు వెళ్లగా ఏడుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపడానికి ప్రయత్నించగా పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని తనిఖీ చేయగా 1 కిలో 800 గ్రాముల ఎండు గంజాయి ఉన్న ప్యాకెట్ పట్టుబడింది. దీంతో పోలీసులు వారిని ప్రశ్నించగా కాటారం గ్రామానికి చెందిన దుర్గం నందకిషోర్, మెరిజాల రోహిత్, కడారి కార్తీక్, మారపాక రిష్వంత్, కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్ది నిఖిల్‌రాజ్, బయ్యారం గ్రామానికి చెందిన జగజంపుల విష్ణు, ఎర్రగుంటపల్లికి చెందిన జక్కు రాజేష్‌గా గుర్తించారు. నందకిషోర్ అనే యువకుడు భూపాలపల్లికి చెందిన సిద్ధు అనే యువకుడి వద్ద నుంచి గంజాయిని తెచ్చి మిగతా ఆరుగురికి తలా కొంత విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని ఎస్సై అభినవ్ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.36వేలు ఉంటుందని, ఏడుగురు యువకులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో పీసీలు లక్ష్మిరాజు, నరేష్, జంపన్న, సాంబశివరావు, లవన్, హరి, హోంగార్డు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 8: జనగామ కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాద దంపతులు గద్దల సంపత్‌రావు, కవితలపై దాడిచేసి గాయ పరిచిన పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో రెండోరోజు గురువారం న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మసరగాని వినయ్‌కుమార్,సభ్యులు, న్యాయవాదులు వైనర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, చంద్రయ్య, భిక్షపతి, కొండి రవీందర్, చిరంజీవి, ప్రతాప్, అశోక్, రాజేందర్, విజయ్‌కుమార్, లింగమూర్తి, ప్రణయ్, సంజీవ, అర్చన, నవత, రజిత, మన్సూర్‌అలీ, సురేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో..

కృష్ణకాలనీ (భూపాలపల్లి) : జనగామలో న్యాయవాద దంపతులపై పోలీసులు చేసిన దాడిని నిరసిస్తూ భూపాలపల్లిలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కూడలిలో ఆందోళన చేపట్టారు. న్యాయవాదులు శ్రీనివాసచారి, వేషాల రవిందర్, వేషాల అనిల్, రాజ్‌కువర్, కంప అక్షయ, వసంత తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు

ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఆగస్టు 8: జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ శబరీశ్ హెచ్చరించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభమైనందున ర్యాగింగ్ నియంత్రణకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలు, పాఠశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి పాఠశాలలో ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలన్నారు. ర్యాగింగ్‌పై త్వరలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఎవరైనా ర్యాగిం గ్‌కు పాల్పడితే 100కు లేదా 8712670120కు ఫోన్ చేయా లని సూచించారు. డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, మహర్షి డిగ్రీ కళాశాల, జాకారం సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాల, టీఎస్ఆర్ఎస్ కళాశాల, పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఏజీపీకి లాయర్ల సన్మానం

మల్హర్, ఆగస్టు 8: భూపాలపల్లి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు శివకుమార్‌ను భూపాలపల్లి న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాద వృత్తిలో ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్ప గించిన ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు శివకుమార్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మద్దిమడుగులో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం

మహాముత్తారం, ఆగస్టు8: మండలంలోని సింగారం గ్రామపంచాయతీ పరిధి మద్దిమడుగు గొత్తికోయగుడెంలో సీఆర్పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఆర్పీఎఫ్ డీఎస్పీ రామకృష్ణన్ గొత్తికోయలకు నిత్యావసర సరుకులు, సింటెక్స్ ట్యాంకులు, సోలార్ లైట్లు, కుట్టుమిషన్లు, సైకిళ్లు, యువతకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్యారంబోర్డు పంపిణీ చేశారు. మహిళలకు, పిల్లలకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు గ్రామంలో ప్రవేశం కల్పించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం ఎస్సై మహేంద్ర కుమార్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణతోపాటే సేవా కార్యక్రమాలు

కాటారం, ఆగస్టు 8: ప్రజల కోసం నిరంతరం శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పేదలకు సేవా కార్యక్రమాలు అందించడానికి సీఆర్‌పీఎఫ్ సిద్ధంగా ఉంటుందని కాటారం సీఆర్‌పీఎఫ్ జీ58 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్‌హాల్‌లో గురువారం సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సీఏపీ (పౌర కార్యాచరణ కార్యక్రమం) నిర్వహించారు. పలువురు విద్యార్థులకు సైకిళ్లు, పేద మహిళలకు కుట్టు మిషన్లు, క్రీడాకారులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్ కిట్లు, క్యారం బోర్డులు, కాటారం పీహెచ్‌సీ, ఎర్రగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రం, ప్రతాపగిరి జీపీలకు వాటర్‌ట్యాంకులు అందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీర్‌పాల్ సింగ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు మీనా, బాబుసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.